క్లుప్తంగా

రేపు సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవం

గిద్దలూరు రూరల్: స్థానిక రేడియో బావి సమీపంలోని సత్యసాయి మందిరంలో ఈ నెల 24న సత్యసాయిబాబా 12వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సత్య సాయి సేవా సమితి మండల కన్వీనర్ ఎస్.అనంతరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మందిరంలో గాయత్రి హోమంతో పాటు వివిధ భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ వివేకానంద కళాశాలలో 1983–88 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో పీఆర్ కాలనీలోని వృద్ధాశ్రమంలో శనివారం అన్నదానం చేశారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిత్ర బృందం తులసీబాబు, సూర్య సుబ్బారాయుడు, గజ్జా శ్రీనివాసులు, దుర్గా రంగస్వామిరెడ్డిలు తమ గురువు తిరుపతిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

నేడు వైద్య శిబిరం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వితాసుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఒంగోలుకు చెందిన రమేష్ సంఘ మిత్ర వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యశాల నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో ఆర్థోపెడిక్ ఐ.వెంకటేశ్వరరెడ్డి, యూరాలజీ మాలకొండారెడ్డి, న్యూరో డాక్టర్ ధీరజ్, వైద్యశాల సీఓఓ హరికుమార్‌రెడ్డిలు వైద్య సేవలు అందించనున్నారు.

కేజీబీవీలో ప్రవేశ గడువు 30 వరకు పొడిగింపు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంతో పాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు ప్రవేశ గడువు ఈ నెల 30 వరకు పొడిగించారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40, 7వ తరగతిలో 7, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో 2, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 మందికి సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇటీవల 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన బాలికలు ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈనెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 85007 23716 నంబరును సంప్రదించాలని కోరారు.

నిర్జన ప్రాంతంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిలోని ఓ హోటల్ వెనుక నిర్జన ప్రాంతంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం .. ఈ నెల 19వ తేదీన కర్నూల్ జిల్లా బాలాజీ నగర్‌కు చెందిన శివారెడ్డి (69) కర్నూలులోని తన ఇంటి నుంచి బయల్దేరి వచ్చాడు. ఇంటికి చేరుకోక పోవడంతో కుటుంబ సభ్యులు కర్నూల్లోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీశైలం రోడ్‌లోని ఓ హోటల్ వెనుక భాగంలో మృతదేహం పడి ఉందన్న సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమారుడు శ్రీకాంత్‌రెడ్డితో పాటు బంధువులు పెద్దదోర్నాల చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడికి మతిస్థిమితం లేదని బంధువులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా వేణుగోపాల్‌రెడ్డి



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్

త్రిపురాంతకం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన కమిటీ నియామక ఉత్తర్వులను ఆ శాఖ డీఆర్‌ఓ రాజశేఖర్ విడుదల చేశారు. పీఏసీఎస్ చైర్మన్‌గా దగ్గుల వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్‌లుగా గుర్రం అశోక్‌బాబు, మేకపోతు పెద్దలింగారెడ్డిలు జిల్లా అధికారుల నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు శాఖ అధికారి పేరయ్య, ఇతర ప్రముఖులు వారిని అభినందించారు.

నిందితుడికి రిమాండ్

దర్శి: మండలంలోని తానంచింతలలో నెల క్రితం వదినను కత్తితో పొడిచి గాయపరిచిన కేసులో గ్రామానికి చెందిన కాకర్ల వెంకటేశ్వర్లుకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం నిందితుడిని చలివేంద్రం సమీపంలోని శ్రీ కాశీనాయన ఆశ్రమం వద్ద అరెస్టు చేసి దర్శి ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వాడవాడలా రంజాన్ వేడుకలు



పెద్దదోర్నాలలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు



కొమరోలులో..



త్రిపురాంతకంలో..



మార్కాపురం: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



గిద్దలూరు: నంద్యాల రోడ్డులో..



దర్శిలో..



ముండ్లమూరు మండలం పెద ఉల్లగల్లులో..



దొనకొండలో..



తాళ్లూరు: కరిముల్లాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

కంభం: కంభం, అర్థవీడు మండలాల్లో రంజాన్ పండగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామున స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ర్యాలీగా ఈద్గాకు, మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనలు ముగించుకొని వచ్చిన తర్వాత స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఉల్లాసంగ గడిపారు. తీవ్ర ఎండల నేపథ్యంలో ఈద్గా వద్దకు ప్రార్థనలకు వచ్చిన ముస్లింలకు పోలీసులు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, యువకులు దాహార్తి తీర్చి ఔదర్యాం చాటుకున్నారు. సీఐ రాజేష్, ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ప్రార్థనలకు వచ్చిన వారికి మంచినీరు సరఫరా చేసారు. ఈద్గా వద్ద ఎటువంటి అసౌకర్యాలు, ట్రాఫిక్ సమస్య కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పుల్లలచెరువు: నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు శనివారం రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో వందలాది మంది ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

దర్శి: రంజాన్ పండగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలంతా కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పండగ సందర్భంగా హిమాములు, మౌలానాలు అల్లా సందేశాలను వినిపించారు. కులమతాలకతీతంగా ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండగను ఆనందంగా జరుపుకున్నారు. షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాష ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలకు హాజరయ్యారు. అందరితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

త్రిపురాంతకం: రంజాన్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. త్రిపురాంతకంతో పాటు మండలంలోని మేడపి, దూపాడు, గొల్లపల్లి, వెల్లంపల్లిలో ముస్లింలు రంజాన్ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు.

కురిచేడు: రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు ఈద్గా వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామంలోని అన్ని మసీదుల్లో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేసి విరమణ అనంతరం అందరూ ఒకచోట చేరి ప్రార్థనలు చేశారు. అనంతరం హఫీసా హుస్సేన్ రంజాన్ విశిష్టత, ఖురాన్ ప్రకారం ఎలా నడచుకోవాలో వివరించారు.

గిద్దలూరు రూరల్: ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ పండగ సందర్భంగా శనివారం మండలంలోని ఈద్గాల వద్ద పెద్ద ఎత్తున సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. నంద్యాల రోడ్డులోని ఈద్గా వద్ద, కొంగలవీడు రోడ్డులోని ఈద్గా వద్ద, అంబరం, ముండ్లపాడు, తాళ్లపల్లె, ఉయ్యాలవాడ, కొమ్మునూరు గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్‌లోని అంశాలను బోధించారు.

కొమరోలు: మండలంలో రంజాన్ వేడుకలను ముస్లింలు శనివారం ఘనంగా నిర్వహించారు. పలు ఈద్గాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ర్యాలీగా ఈద్గాల వద్దకు చేరుకున్నారు.

పెద్దదోర్నాల: రంజాన్ పర్వదినం పవిత్రతకు ప్రతీక. అటువంటి రంజాన్ పండగను మండలంలోని ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. నెల రోజుల పాటు క్రమం తప్పకుండా ఉపవాస దీక్షలను ఆచరించటంతో పాటు ఐదు పూటలా నమాజ్, రాత్రి వేళల్లో తరావీహ్ నమాజ్‌ను ఆచరించిన ముస్లింలు శనివారం పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీశైలం రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. షబ్బీర్ మౌలానా, ఇబ్రహీం మౌలానాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఖబరస్తాన్ వద్దకు చేరుకుని తమ కుటుంబ పెద్దల కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.

తాళ్లూరు: రంజాన్‌ను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. తూర్పుగంగవరం, రామభద్రాపురం, శివరామపురం, మల్కాపురం, బొద్దికూరపాడు, గంగపాలేల్లో ప్రత్యేక నమాజ్ చేశారు. కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా నివాసంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ వేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎంఏ ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ వీసీ రెడ్డి పాల్గొని శుభాకంక్షలు తెలిపారు. మల్కాపురం మాజీ సర్పంచి వలి ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. జిల్లా కో ఆప్షన్ మెంబర్ ఆదాం షరీఫ్ ముస్లింలకు రంజాన్ శుంభాకాంక్షలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్

మార్కాపురం టౌన్: రంజాన్ పండుగను శనివారం మార్కాపురం నియోజకవర్గంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులలకు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పొదిలి: రంజాన్ పర్వదినాన్ని అత్యంత భక్తి,శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఈద్గా మైదానంలో శనివారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వేలాదిగా పాల్గొన్నారు. సీఐ రాఘవేంద్ర, ఎస్సైలు మల్లికార్జున, దీపిక బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్ల, గొట్లగటు, సిద్ధవరం, చినారికట్ల గ్రామాల్లో ప్రార్థనలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

తర్లుపాడు: మండలంలో ఈద్ ఉల్ ఫిత్ర్‌ను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తుమ్మలచెరువు, మీర్జాపేట, కొత్తూరులో ఈద్గాలకు చేరుకున్నారు.

దొనకొండ: ముస్లింలు రంజాన్ పవిత్ర మాసంలో కఠోర ఉపవాసాలతో ఖురాన్ పఠనం చేస్తూ శనివారం రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లోని ముస్లింలు ఐక్యంగా దొనకొండ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, మాజీ కన్వీనర్ కందుల నారపురెడ్డి, జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డిలు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ముండ్లమూరు: మండలంలోని ముస్లింలు శనివారం రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెద ఉల్లగల్లు, పసుపుగల్లు, వేముల, పులిపాడు, ఉమామహేశ్వరపురం, మారెళ్ల, ముండ్లమూరు, ఈదర గ్రామాల్లో ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



పొదిలి: ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



తర్లుపాడు: తుమ్మల చెరువులో ప్రత్యేక ప్రార్థనలు



కురిచేడులో..

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగనన్న'



గొట్లగట్టులో స్టిక్కర్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొనకనమిట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు వివరించేందుకు నిర్వహిస్తున్న ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమం ఊపందుకుంది. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దెత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. శనివారం గొట్లగట్టు, చినారికట్ల, సిద్ధవరం, తువ్వపాడు, పాతపాడు, కొనకనమిట్లలో కరపత్రాలు అందజేశారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే అన్నా పరామర్శ



బాలసుబ్రహ్మణ్యాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకుడు, 2వ వార్డు ఇన్‌చార్జి నంద్యాల బాలసుబ్రహ్మణ్యం యాదవ్ అనారోగ్యానికి గురయ్యాడని తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం ఆయన్ను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై నంద్యాల వెళ్లి చికిత్స చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చిన బాలసుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్యే కలిసి పరామర్శించారు. ఆయన వెంట నగర పంచాయతీ సచివాలయం కన్వీనర్ కె.ఈశ్వర్‌నాయుడు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్‌వలి, వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దర్ల శ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీరాములు, నరవ వెంకటస్వామి, చెన్నయ్య ఉన్నారు.

నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తాం



త్రిపురాంతకం ఆలయంలో సంప్రోక్షణ, పూజల్లో పాల్గొన్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

- త్రిపురాంతకం ఆలయంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటుపై మంత్రి సురేష్
- ఆలయంలో సంప్రోక్షణ పూజలు

త్రిపురాంతకం: పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయం వద్ద నేలకొరిగిన ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠించనున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం ఆలయాన్ని సందర్శించి ఈఓ చెన్నకేశవరెడ్డితో ఈదురుగాలులు ఉరుములతో కూడిన వర్షం కారణంగా ధ్వజ స్తంభం దెబ్బతిన్న విషయంపై చర్చించారు. త్వరలో శాస్త్రోక్తంగా నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠకు తగిన ముహూర్తం, అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. సుమారు రూ.20 లక్షలతో నిర్మాణ పనులపై ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం పక్కకు తొలగించి అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జిల్లా బీసీసెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి సహ కన్వీనర్ యల్లారెడ్డి, ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ మల్లికార్జున్, పార్టీ నాయకులు దగ్గులు గోపాల్‌రెడ్డి మంత్రి వెంట ఉన్నారు.



త్రిపురాంతకం ఆలయంలో ధ్వజస్తంభాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధ్వజస్తంభం పరిశీలించిన అధికారులు

త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో నేలకొరిగిన ధ్వజస్తంభాన్ని తహసీల్దార్ వీ కిరణ్, సీఐ పాపారావు, వీఆర్‌ఓ వెంకటలక్ష్మి ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు సుబ్బారెడ్డి తదితరులు పరిశీలించారు. నేలకొరిగిన ధ్వజస్తంభం సామగ్రి, తొడుగులు తూకం వేసి భద్రపరిచినట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.

ఇరు కుటుంబాల ఘర్షణపై కేసు

యద్దనపూడి: కుక్క వెంట పడటంతో రాయి విసిరినందుకు ఇరుకుటుంబాల మధ్య ఘర్షణ జరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈఘటన శుక్రవారం రాత్రి మండలంలోని అనంతవరం గ్రామంలో జరిగింది. ఏఎస్సై శేషసాయి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మద్దిరాల సాల్మన్, మద్దిరాల ప్రేమానందమ్మ ఇరుగుపొరుగు కుటుంబాలు. ఇంటి స్థలం విషయంలో వీరికి వివాదాలున్నాయి. శుక్రవారం రాత్రి మద్దిరాల సాల్మన్ ప్రేమానందమ్మ ఇంటి మీదుగా వెళ్తుండగా రోడ్డుపై ఉన్న కుక్క వెంట పడటంతో సాల్మన్ రాయి విసిరాడు. దీంతో ప్రేమానందమ్మ మా కుక్కనే కొడతావా అంటూ రాయి విసిరింది. దాంతో ఇరుకుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణలో సాల్మన్ రాజు అక్క దేవుని దయమ్మకు కొద్దిపాటి దెబ్బలు తగలాయి. ఈ మేరకు వీరిరువురు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

జగనన్న కాలనీలో సిమెంట్ బ్రిక్స్ యూనిట్



యూనిట్ ప్రారంభిస్తున్న తహసీల్దార్

పొదిలి: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను సత్వరమే పూర్తి చేసేందుకు సొంతంగా ఇటుకల తయారీ యూనిట్ ప్రారంభించినట్లు తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక జగనన్న లే అవుట్లో జె.ఎస్.ఆర్ సంస్థ ఇటుకల తయారీ యూనిట్‌ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. సంస్థ 1050 గృహాల నిర్మాణాలు లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఇన్‌చార్జ్ ఆర్‌ఐ కిలారి సుబ్బారావు, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, జేఎస్ఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలన్నారు. పలు శాఖలకు చెందిన అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

ధ్వజస్తంభం కర్ర ఊరేగింపు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలోని యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేయ తలపెట్టిన ధ్వజస్తంభం కర్రకు శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ఆలయం వరకు ట్రాక్టర్‌పై ఊరేగించగా చిన్నారులు, మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ పి. కృష్ణవేణి, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేష నరసింహాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కందుకూరు: నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని యోగా గురువు బీవీ రమణ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా శనివారం కనిగిరి రోడ్డులోని ఒకటవ పొగాకు వేలం కేంద్రంలో సిబ్బంది, అధికారులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో యోగాసనాలను వేయించారు. ప్రాణాయామం, యోగను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. వేలం కేంద్రాల నిర్వహణాధికారులు చైన్‌రామ్‌మీనా, రాజగోపాల్‌రెడ్డి, సిబ్బంది సీహెచ్ శ్యామ్‌సుందరం, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండలో భక్తుల సందడి



వెలుగొండలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు

కొనకనమిట్ల: వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, అభయాంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.